కథ

# సుబ్బారావు కూలబడ్డాడు

పొన్నపల్లి ఉషాదేవి

''బిందెలోవా? కూజాలోవా?'' మంచినీళ్లు అందిస్తున్న భార్యని అడిగాడు సుబ్బారావు.

''కూజాలోవేనండీ'' చెప్పింది పార్వతి.

''నీ బొంద. తిరిగి తిరిగి రాగానే కూజాలో నీళ్లిస్తారుటే ఎవరయినా? జలుబు చెయ్యదూ?''

''అబ్బే. అంత చల్లగా లేవండీ. ఇప్పుడే పట్టాను కుళాయొస్తే'' పార్వతి గొణిగింది.

''ఎప్పుడూ ఏదో సాకు చెప్పి పని తప్పించుకోవాలని చూస్తావు. ఏదో విషయం లేకుండా ఈయన మటుకు ఎందుకు చెప్తాడు. చెప్పినట్టే చేస్తే సరిపోతుందిలే అని ఆలోచించవేం? వీడు చెప్తే నేనెందుకు చెయ్యాలని నీ వెధవ ఏడుపు'' మంచినీళ్లు ఒక గుటక వేసి ''నీ బొంద. చల్లగా లేవూ ఇవి? ఫ్రిజ్‌లో పెట్టిన నీళ్లల్లా ఉన్నాయి. పోయి బిందెలో నీళ్లు తీసుకురా'' అన్నాడు సుబ్బారావు.

పార్వతి ఆ గ్లాసులో నీళ్లు పూలమొక్కలకి పోసి, తిరిగి కూజాలో నీళ్లే తెచ్చిచ్చింది భర్తకి.

''ఈ పని ముందే ఎందుకు చెయ్యకూడదూ. కొంచెం బుర్రపెట్టి ఆలోచించి పనిచేస్తుండు'' ఖాళీ గ్లాసు పార్వతి చేతికి ఇస్తూ అన్నాడు సుబ్బారావు.

ఇదంతా గమనిస్తున్న చిన్న కూతురు శైలజ అడిగింది తల్లిని. ''అమ్మా! నువ్వు మళ్లీ కూజాలో నీళ్లే ఇచ్చినా కనుక్కోలేకపోయాడు నాన్న. అబ్బ ఎలా భరిస్తున్నావమ్మా ఈ నస. విషయమేదీ ఉండదు. ఊరికే మాట్లాడతాడు''

''పోనీద్దూ వదిలెయ్యి. కొన్ని విషయాలు పట్టించుకోకూడదు తల్లీ. అన్నీ ఆలోచిస్తూ కూచుంటే సుఖంగా బతకలేం''

''ఇప్పుడాయన చేస్తున్న పనంతా అదే గదా. ఆయన సుఖపడడు. మనల్ని సుఖపడనివ్వడు''

''సర్లే... నోరు మూసుకుని నీ పని చూసుకో. నా మొగుడిని ఏమన్నా అంటే కొడతా'' నవ్వుతూ కూతుర్ని మందలించి సాయంత్రం వంటలోకి ఏం వండాలో చూసుకుంటోంది.

''ఇదిగో! ఏవే! నిన్నే'' వరండాలో నుంచే పిలిచాడు సుబ్బారావు.

''ఆ! ఆ!! వస్తున్నా'' అంటూ వెళ్లింది పార్వతి.

''ఇంత గట్టిగా పిలుస్తుంటే ఊ అనిగానీ, ఆ అనిగానీ అనవేం?''

''చెప్పాను కదండీ వస్తున్నానని''

''నువ్వు గొణుక్కుంటే వినిపిస్తుందా? అది సరేగానీ సాయంత్రం ఏం కూర?'' అడిగాడు.

''అదే చూస్తున్నా! ఇంతలోకి మీరు పిలిచారు''

''టమాటాలు రేపు వండుకోవచ్చులే. దోసకాయ ఎల్లుండి. ఈ పూటకి వంకాయలు వండు''

''అలాగే'' వెళ్లబోయింది.

''అలాగే అని వెళ్లిపోవడం కాదు. వంట చేస్తున్నంతసేపూ కాస్త దృష్టి పెట్టి చెయ్యి పూట పూటా మాడిపోయిన కూరలే''

''అది చెప్పటానికి పిలిచావా? అయినా, అన్ని విషయాలూ ఎందుకు నాన్నా నీకు? అమ్మకి తెలీదా?'' ప్రభాకర్ అడిగాడు.

''ఇప్పుడు చెప్పలేదనుకో. గట్టిగా రాళ్లల్లే ఉన్న టమాటాలను ఇప్పుడు వాడేస్తుంది. వాడిపోయి, పాడవ్వడానికి సిద్ధంగా ఉన్న వంకాయలు కుళ్లపెట్టి, కుళ్లపెట్టి తీసుకెళ్లి దిబ్బలో పోస్తుంది''

''ఆ విషయం అమ్మకి తెలుస్తుంది కదా నాన్నా. తనని చూసుకోనీ ఆ గొడవంతా?''

''దానికి తెలియదురా! అదంతే. అది ఒక మొద్దు. ఈపాటి బుర్ర కూడా ఉందా దీని ముఖానికి'' టీవీ ఆన్ చేస్తూ అన్నాడు సుబ్బారావు.

పార్వతి నిశ్శబ్దంగా అక్కడ్నించి వెళ్లిపోయింది.

అందరూ భోజనానికి కూర్చున్నారు. కూర నోట్లో పెట్టుకోగానే ''అబ్బో! చాలా బావుందే కూర. నీకు రుచిగా వండటం కూడా వచ్చా'' భార్య ముఖంలోకి తొంగిచూస్తూ వెటకారంగా తలని అటూ ఇటూ ఆడిస్తూ అడిగాడు సుబ్బారావు.

పార్వతి కళ్లల్లో కన్నీటి పొర. గమనించినట్లుగా అన్నాడు ప్రభాకర్. ''అంత ఎగతాళి చేస్తావేం నాన్నా పాపం''

నోటి నిండా ఉన్న ముద్దని నములుతూ, పెద్దగా నవ్వుతూ, పార్వతి వీపు మీద ధడేలున ఒక దెబ్బ వేసి అన్నాడు సుబ్బారావు- ''మీ అమ్మంటే నాకు ప్రేమరా! చనువు కాబట్టి అంటున్నాను. ఏవే! నిన్నంటే పిల్లలకి కోపమొస్తోందే. నాకు నువ్వంటే బాగా ఇష్టం కనక అంటాను''

''ఎంత ఇష్టమయితే మాత్రం అంత ఎగతాళి చేస్తారా?'' శైలజకి ఒళ్లు మండింది.

పార్వతి రియాక్షన్ గమనించకుండానే భోజనం ముగించి లేచాడు సుబ్బారావు.

★ ★ ★

ప్రభాకర్ స్నానం చేస్తున్నాడు.

''ఏరా! నీ సర్టిఫికెట్ల మీద ఎటస్టేషన్ చేయించాలన్నావుగా. అవి ఇస్తే చేయించుకొస్తాను'' బాత్‌రూమ్‌లో ఉన్న కొడుకుని ఉద్దేశించి అన్నాడు సుబ్బారావు.

''ఒక్క నిమిషం వుండు నాన్నా. వచ్చేస్తున్నాను''

''లేటయిపోతుందేమో. ఇప్పుడయితే ఆ చర్చిల్‌గాడు ఖాళీగా ఉన్నాడు. అవును కొత్త సబ్బు తీసిందా మీ అమ్మ''

''తియ్యలేదు నాన్నా! మర్చిపోయిందేమో. అయినా ఈ సబ్బు ఇంకా రెండ్రోజులు వస్తుంది''

''ఏవే! కొత్త సబ్బు తియ్యమన్నానా? వినిపించుకోవా? సబ్బు తీయడానికి తీరికలేదా? ఇప్పుడే కాదు ఎప్పుడూ అంతే. సబ్బు అయిపోగానే తీస్తుండు కొంచెం. ఏరా! నీ సర్టిఫికెట్లిస్తే సంతకాలు పెట్టించుకొస్తా.''

''వాడు స్నానం చేస్తున్నాడుగా. రెండు నిమిషాలు ఆగచ్చుగా''

''అహో! నువ్వెళ్లు. నువ్వెళ్లి పెట్టించుకురావే సంతకాలు. ఆ చర్చిల్‌గాడేమీ నీలాగే ఇంట్లో తిని కూర్చోడు. ఏరా సర్టిఫికెట్లేవీ''

''అయిపోయింది నాన్నా. ఒక్క క్షణం, వచ్చేస్తున్నాను.''

''నువ్వు రావక్కరలేదు. ఎక్కడున్నాయో చెప్పు''

''నా బీరువాలో ఉన్నాయి నాన్నా! అయినా ఒక్క క్షణముండు''

''ఏవే! వాడి బీరువా తాళాలు ఎక్కడ పడేశావు''

''దిండు కింద''



''ఏ దిండు కింద?''

''వాడి మంచం మీదే''

ఈ సంభాషణంతా జరగడానికి కేవలం ఒక్క నిమిషమే పట్టింది.

స్నానం ముగించుకుని, ఒళ్లయినా తుడుచుకోకుండా ఆదరాబాదరాగా తన రూమ్‌లోకి వచ్చిన ప్రభాకర్ స్థాణువయ్యాడు.

తన బీరువాలో ఉన్న మొత్తం అన్ని బట్టలూ కింద గుట్టగా పోసి ఉన్నాయి.

''అయ్యయ్యో! ఇదేమిటండీ అన్నీ ఇలా పడేశారు?''

''పడేస్తే పడేశాన్లే. నీ సర్టిఫికెట్లేవీ''

''మూడో అరలో కాయితం కింద''

''ముందే చెప్పి చావచ్చుగా ఆ విషయం. ఆ చర్చిల్‌గాడు ఈపాటికి ఇంటికి వెళ్లిపోయుంటాడేమో. అన్నీ నేనే చూసుకోవాలి. ఎవ్వడికీ ఏమీ పట్టదు. ఇంట్లో పని చేస్తూ కూర్చోవడానికీ సరిపోతోంది నాకు. ఎవరినీ ఏమీ అనకూడదు. పెంటముఖం పెట్టుకుని కూర్చుంటారు''

''అది కాదు నాన్నా! ఇప్పుడింత హడావుడి దేనికి? రేపు చేయించుకోవచ్చుగా''

''రేపు చేయించుకుంటావా? వెళ్లు. వెళ్లు రేపే చేయించుకో. తర్వాత టైమైపోయిందని ఏడుస్తూ కూర్చో''

''ఇవాళ మూడో తారీకే కదా నాన్నా, రేపు కదా లాస్ట్ డేట్'' కోపంగా అన్నాడు ప్రభాకర్.

''ఇవాళ మూడో తారీకా? నాలుగు కాదా! అయితేనే ఇవాళే చేయించుకుంటే ఏం పోయింది? ఎప్పటి పని అప్పుడే చేస్కోవాలి. ఏవే! ఈ బట్టలన్నీ మడతపెట్టెయ్యి''

బయటికెళ్లిపోయాడు సుబ్బారావు.

బట్టలు మడతపెట్టడం మొదలుపెట్టింది పార్వతి.

★ ★ ★

''రామనాథం వచ్చి వెళ్లాడు మీ కోసం. మీరు ఇంటికి రాగానే ఫోన్ చెయ్యమన్నాడు తనకి'' భర్త ఇంటికి రాగానే చెప్పింది పార్వతి.

''వచ్చి వెళ్లిపోయాడా? అదేంటి? నేను వచ్చేవరకూ కూర్చోమని చెప్పలేదా?''

''చెప్పానండీ. ఆయనకేదో ముఖ్యమైన పనుందట. అందుకని వెళ్లిపోయాడు''

''నువ్వు కూర్చోమని చెప్పుండవు. లేకపోతే ఎందుకు వెళ్లిపోతాడు? సరే. ఆ పది వేలూ ఇచ్చెయ్యాల్సింది'' కోపంగా అన్నాడు సుబ్బారావు.

''ఏ పదివేలు?'' ఆశ్చర్యంగా అడిగింది పార్వతి.

''అంటే ఇంట్లో ఏం జరుగుతున్నా నువ్వు పట్టించుకోవా? నేనొక్కడినే ఇంటి పనీ, బయట పనీ నెత్తినేసుకోవాలా?''

''అది కాదండీ, రామనాథం వస్తాడనీ, అతనికి డబ్బులిమ్మనీ మీరు చెప్పలేదు కదా!''

''చెప్పకపోతే ఆ మాత్రం ఊహించలేవా? ఇవాళ గనక వాడికి డబ్బులివ్వకపోతే నానా యాగీ చేస్తాడని తెలీదా నీకు? వాడు రాగానే నాకెందుకు ఫోన్ చెయ్యలేదు నువ్వు'' ఇల్లెగిరిపోతోంది అతని ధాటికి.

''మీరు సెల్ తీసుకువెళ్లలేదు కదా''

''అదొకటి నా ప్రాణానికి. వాడికి ఇవ్వడానికేగా నేను నిన్న బాంకు నుంచి డబ్బు తీసుకొచ్చింది. ఈ డబ్బు ఏదో పనుండే తీస్కొచ్చి ఉంటాడని అనుకొని నువ్వు అడగద్దా? అన్నీ నేనే చెప్పాలా? లక్ష పనులుంటాయి నాకు బయట. నీలాగే దున్నపోతులా తిండి తిని పడుకోటం కాదు.''

''అది కాదండీ. రామనాథానికి డబ్బు ఇమ్మని మీరే బయటి నుంచి ఫోన్ చేసి చెప్పచ్చుగా నాతో...మొన్నొకసారి గూర్ఖాకి పండగ మామూలుగా పది రూపాయలు ఇస్తే మిమ్మల్నడక్కుండా ఎవ్వరికీ ఎప్పుడు ఒక్క రూపాయి కూడా ఇవ్వద్దని చెప్పారు'' బాధగా అంది పార్వతి.

''అహా! అటువంటి విషయాలు బాగా గుర్తుంటాయి. సమయానుకూలంగా ఆలోచించద్దా! పెద్ద రోషం ముంచుకొచ్చింది. ఒక ఇల్లూ, ఒక సంసారమూ, ఒక డిసిప్లినూ ఏవీ లేవు. ఛీ.ఛీ. ఎప్పుడూ ఏం ఆలోచిస్తుంటావే. కుళ్లముఖం పెట్టుకొని ఆలోచిస్తుంటావు''.

''అవును. ఆలోచిస్తుంటాను. నిన్ను చితకబాదకుండా ఎలా నిగ్రహించుకోవాలా అని ఆలోచిస్తుంటాను. నీకంటే వంద రెట్లు ఎక్కువగా నిన్నెలా తిట్టాలా? అని ఆలోచిస్తుంటా. నా మీద నీకున్న దిక్కుమాలిన చనువునీ, ప్రేమనీ ఎలా భరించాలా అని ఆలోచిస్తుంటే నిన్ను ఒంటరివాడ్ని చేసి నా పిల్లలతో పాటుగా ఏ దేశానికి వెళ్లిపోదామా అని ఆలోచిస్తుంటాను. ఇప్పుడర్థమయిందా ఏం ఆలోచిస్తుంటానో'' ఒక్కొక్క మాటా తూటాలా విసిరింది పార్వతి.

దిమ్మెరపోయిన సుబ్బారావు కుర్చీలో కూలబడ్డాడు.

★